# గడియారం

ఇత్యేతన్నామ సహస్రం కథితంతే ఘటోద్భవ.... సర్వాప మృత్యు శమనం అకాల మృత్యు నివారణం ... సర్వజ్వరార్తి శమనం దీర్ఘాయుష్య ప్రదాయకం....

లలితా సహస్రనామం చదువుకుని ఉత్తర పీఠిక దగ్గర కొచ్చిసరికి స్వరం కించిత్ హెచ్చించి మంచంమీద వున్న ఆయనకి స్పష్టంగా వినపడేలా చదివి సాష్టాంగ ప్రణామం చేసి ప్రసాదం పట్టుకుని బయటకు వచ్చింది రమారాజ్యం.

అంతవరకూ ఆమె గొంతు వింటూనే వున్న కోదండరామయ్యకి కళ్లు మూతలుపడ్డాయి. ముందు హాల్లో ట్యూబ్‌లైట్ వేసింది కోడలు. తరువాత వరండాలో వేసింది.

' అమ్మా, యింట్లో ఎక్కడా చీకట్లు దోబూచులాడకుండా ఖణీగా వెలుతురుంటే లక్ష్మీప్రదమని బామ్మ చెప్పేది కదూ.... చూశావా యిల్లు యిప్పుడు ఎంత కళకళలాడుతోందో.'

వరండాలో ఆ ట్యూబ్‌లైటు కొడుకు వేయించాడు. ఆ రోజు సన్యాసిరాజు మొదటినెల జీతంలో మొదటి ఖర్చు .... లైటు వెలుతురు చూసి చంటిపిల్లాడిలా ముచ్చటపడిపోయాడు.

"ఇది నీ కోడలు సలహా !" అన్నాడు తల్లితో. కొత్త కోడలు కొత్తింటి పిల్ల, కొత్త దీపం వంక చూసింది. ట్యూబ్‌లైటు వెలుతుర్లో బుగ్గలు ఎర్రగా గులాబీలా మిలమిలలాడాయి.

మసకగా వున్న గదిలోకి రమారాజ్యం వచ్చింది. కోదండరామయ్య కళ్లు విప్పాడు.

"ఏమండీ అదోలా వున్నారు .... ఒంట్లో ....."

" అబ్బే ఏం లేదు .... నీ గొంతు వింటూ మోగన్నుపడింది."

" లేచి కాస్త బయటకు రారాదూ, మీ కుర్చీలో కూచుంటే మీకూ హాయిగా వుంటుంది. లేవండి ప్రసాదం యిదిగో, నోట్లో వేసుకోండి ! "

పటికబెల్లం ముక్క కళ్ళకద్దుకొని నోట్లో వేసుకుని చెయ్యి తలకేసి రాసుకున్నాడు కోదండరామయ్య.

"ఏమిటండీ ఆ పరాకు ? మళ్లీ నొప్పి వచ్చిందా ? మాత్రవేసుకున్నారా ?"

" అబ్బే, లేదు."

" ఏమిటండీ ..... అదోలా వున్నారు ? నాతో చెప్పండి ! మళ్లీ నొప్పి రాలేదుకదా ?...."

"లేదే, నొప్పేమీలేదు."

"మరి ?"

"ఏం లేదని చెప్పాగా' తలగడకి జేరబడ్డాడు కోదండరామయ్య.

" అసుర సంధ్యవేళ దీపం లేకుండా ..... " అంటూ కోడలు లోపలికొచ్చింది.

" హమ్మయ్య !" కోదండరామయ్యకి ప్రాణం లేచివచ్చినట్టనిపించింది దీపం వెలగ్గానే.

" టైమెంతయిందో ? "

రమారాజ్యం గోడగడియారం వంక చూసింది. పదకొండున్నరకి ఆగిపోయింది.

"సరోజా ... గడియారం కీ యివ్వడం మరచిపోయాడల్లే వుంది.... నువ్వు....

" ఆబల్ల ఎక్కడం నాకు భయం .... మామయ్యగారూ, ఇదిగో ఈ గడియారం

దగ్గరుంచుకోండి.... ఆయన రాగానే కీ యిచ్చి టైము దిద్దిపెడతారు.''

'' సరేనమ్మా.''

కోదండరామయ్య నడుం వాల్చాడు. గడియారం ఆగిపోయింది. ఆగిపోవడంలో ఆశ్చర్యం లేదు.... పనిచేసినంతసేపు పనిచేసి ఏ యంత్రమయినా ఆగిపోవాల్సిందే.... దాని టైము ప్రకారం అది జరుగుతుంది కాల ప్రవాహం.... ఎంత ఆలోచించినా అంతుతెగని వ్యవహారం.... దేని సమయానికి అది జరిగిపోవల్సిందే. - బ్రహ్మస్వరూపం కాలం.... మనిషితో, మేధస్సుతో, ప్రజ్ఞతో, దరిద్రంతో, సంపదతో నిమిత్తంలేనిది .... అది కాలం.''

ఆలోచనలో మళ్లీ కళ్లు మూతలుపడుతున్నాయి .... కాని బలవంతంగా కళ్లు విప్పుతూ అడిగాడు '' సరోజా .... జయంతి ఎప్పుడు బయలుదేరుతున్నట్టు రాసింది.... రేపు సాయంకాలం కదూ.... లేక ఈ సాయంత్రమేనా ? ''

'' వచ్చే బుధవారం సాయంకాలం మావయ్యగారూ... పిల్లలకి పరీక్షలైపోగానే బయలుదేరుతానని రాసింది. రిజర్వేషన్లు చేయించేశారట.''

''ఏం పరీక్షలో నమ్మా! ఆయన ఆరోగ్యం అలావుండి చూడాలని ఆరాటపడుతూంటే దిగ్గున లేచిరావడానికి కుర్రవెధవల క్వార్టర్లీ పరీక్షలు అడ్డువచ్చాయా మనవస్తువు కానిదయిపోయింతర్వాత ఏమనుకొని లాభం ?...'' రమారాజ్యం ఉస్సురని నిట్టూర్చింది.

అల్లుడు మంచీ కత్తి మెత్తనా వుంటాయా అనుకుంది ఆరాటంలో సామెత సగం మరచి ....

''లేవండి ... మెల్లగా బయటకు తీసుకువెళతాం. కుర్చీలో కూచుందురుగాని.... ఆ పిల్ల కోసం ఎందుకంత ఆందోళనా ? హాయిగా వుందిగా ....''

''అబ్బే అందుకు కాదే....'' కోదండరామయ్య గడియారం వంకే చూస్తున్నాడు.

ఒక్కక్షణం అక్కడ నిలబడి సరోజ బయటకి వెళ్లింది.

'' మీ మనసులో ఏదో ఉంది. బయటకి చెప్పకూడదూ ! దేనిగురించో ఆలోచించి తెగబాధపడిపోతున్నారు.''

''ఏం లేదే .... బాబిగాడొచ్చే టైమయిందా ? '' అంటూ కోడలిచ్చిన గడియారం తీసి చూశాడు...

దానివంకే అలా చూస్తూ వుండిపోయారు. ఉస్సురని నిట్టూర్చి మళ్లీ తలగడకి జేరబడ్డారు.

రమారాజ్యం మళ్లీ లోపలికి వచ్చేసరికి భర్త కళ్లుమూసుకుని వున్నాడు.

''ఏం అత్తయ్యగారూ.... మీరు బెంగపెట్టుకోకండి. ఏం పర్వాలేదని డాక్టరు చెప్పాడుగా. ఆయన దగ్గరే కూచుని ఆవూటా ఈవూటా చెప్పండి. మావయ్యగారు బాగా బెంగపెట్టుకుంటున్నారు. ''

''ఏం చెప్పనమ్మా, ఏదో దిగులు. నిన్న బాగానే వున్నారు. ఎంతో నవ్వుతూ తిన్నది ఆ తోటకూర పోపూ - మజ్జిగా అన్నమే అయినా - ఎంతో సరదాగా వున్నారు.

''ఈ రోజు ఏమయిందో ఏమో. మళ్లీ నొప్పి వచ్చిందేమో... బాబీ వస్తే ఆయనకు తెలియకుండా డాక్టరు నొకసారి రమ్మని కబురు పంపాలి....''

ఆవిడ దిగులుగా కూచుంది. కొంచెం సేపటి తరువాత పూజగదిలోకి వెళ్లింది.

ఆంజనేయస్వామికి మొక్కుకుని యింత సింధూరం ఆయన నుదుటన పెట్టాలనుకుంది.

సరోజ అటూ యిటూ తిరిగింది. ఏదోలా వుంది తనకీ మనసు. ఆయన రోజూ ఈసరికి యింటికి రావాల్సిందే. ఆఫీసు పని ఒత్తిడి ఎక్కువగా వుందో ఏమిటో ....

మామగారి గదిలోకి వెళ్లింది. ఆయన గుండెల మీద తన గడియారం చేతిలోనే పట్టుకుని ఆలోచిస్తున్నారు.

" మామయ్యగారూ !"

" ఆఁ !" తుళ్లిపడ్డట్టు అడిగారు.

" ఏదో పరాకుగా వున్నారు. అత్తయ్యగారితోనూ ఏం మాటాడటం లేదట ! ఆవిడ కంట తడిపెట్టుకుంటున్నారు. మీకేమిటి లోటు ? ఏమిటి బాధ ? జయంతి గురించి మీరేమీ బెంగపెట్టుకోకండి. అతను చాలా మంచివాడు. అతనికి తగిన భార్య మా వదిన."

" అంతేనంటావా ?" కోదండరామయ్య చేతిలోని గడియారాన్ని పక్కబల్లమీద పెడుతూ అడిగాడు."

"డాక్టరుగారు మరీమరి చెప్పారట ... కంగారుపడ్డానికి ఏమాత్రం అవసరం లేదని రేపు ఆదివారం సాయంకాలం యిలా షికారుగా వస్తామనీ చెప్పారట ... మీరు సందడిగా వుండడంలేదని అత్తయ్యగారు బెంగ పెట్టేసుకుంటున్నారు."

" వెర్రిదమ్మా ! అది వట్టి వెర్రిబాగులది. నాకుమాత్రం సరదానా ? చలాకీగా, హాయిగా నవ్వుతూ వుండాలని వుండదూ, కాని కాలం ఎప్పుడూ మనం చెప్పినట్టే వినదుకదా. కాలం చేతుల్లో బొమ్మలం మనం ... దేని సమయానికి అది ...."

" ఊరుకోండి మావయ్యగారూ, ఆవిడవింటే బెంబేలుపడిపోతారు. అలా బయటకు రండి. కుర్చీలో కూర్చుందురుగాని, నేను దిండు గలేబులూ అవీ మార్చి మీకు నచ్చినపుస్తకం చదివి వినిపిస్తా" అంటూ ఆయనను మెల్లగా బయటకు తీసుకువస్తూ బల్లమీద గడియారం వంక చూసింది – అదీ ఆరు గంటలకి ఆగిపోయివుంది.

" ఏం చదవమంటారూ ? " అంటూ రమారాజ్యం వరండాలోకి వచ్చింది.

"సరోజ చదువుతానంటోంది.... అమ్మా సరోజా .... పక్క దులుపుతున్నట్టుంది .... రా యిలా కూర్చో.... వంటయిందా ?....."

" ఏం వంటో ఏమిటో నాకేం పాలుపోవడంలేదు. మీరు తినకుండా ....." గది లోపలనుంచి దభీలున శబ్దం.

" ఏమిటే అది ? " రమారాజ్యం లోపలికెళ్లింది.

అరెరె ! పడిపోయావా ? ...."

" దిగుతూవుంటే బల్ల తూగిందత్తయ్యా."

కోదండరామయ్య మెల్లగా లోపలకొచ్చాడు. దెబ్బతగిలిందా తల్లీ ..... నీ గడియారం యిచ్చావ్‌గా ... నాకుటైంతో ఏం పని చెప్పు ? .....

" నాకు దెబ్బేం తగల్లేదు మామయ్యగారూ. మీ మనసులో ఆరాటానికి కారణం నాకు తెలిసిపోయింది. అందుకే ...."

బల్లమీద కోడలు చేతిగడియారాన్ని చూశాడు ... అదీ దిద్దేవుంది.

'' నువ్వు తెలివైనదానివమ్మా ... అందుకే నాకొడుకు నిన్ను ప్రేమించి మరీ చేసుకున్నాడు. అది వాడి అదృష్టమే కాదమ్మా ..... అది మా కుంటుంబానికంతటికీ అదృష్టం ....''

-కోదండరామయ్యలో అంత ఉత్సాహం ఎందుకొచ్చిందో, కోడల్ని ఎందుకలా పొగుడుతున్నాడో రమారాజ్యానికి మాత్రం బోధపడలేదు. కోడలివంక అయోమయంగా చూసినా భర్త ముఖంలోని వెలుగుని చూస్తూ మాత్రం ఆమె ముఖం గత మూడు నెలల్లోనూ ఎన్నడూ లేనంతగా వికసించింది.

**ఆంధ్రసచిత్రవారపత్రిక**

29 -7 88 ; 5-8-88